# రాయితీ

అమృతరావు పోయాడన్న వార్త కాలనీ అంతా వ్యాపించింది. ఎవ్వరు పోయినా అందరూ వచ్చి సహాయం చెయ్యడం ఆ కాలనీ ప్రత్యేకత. పిల్లలు అందరూ అమృతరావు దగ్గరే ఉండడం వలన దహన కాండ ఏర్పాట్లు వెంటనే మొదలుపెట్టారు.

ఆ కాలనీ పెద్ద ఇచ్చిన సలహా మేరకు, మొత్తం కర్మకాండకి ఇంతని మాట్లాడమని నిర్ణయించారు.

ఒకాయన వచ్చి మొత్తం కార్యక్రమానికి ఇరవై వేలు ఇమ్మన్నాడు. పన్నెండు వేలు తీసుకుని చేయించమన్నారు. గోదానం జరగదన్నాడు. "అలా అయితే ఎలా! అసలే పోయినాయన తీసుకుపోయాడన్నాడు" అమృతరావు బావమరిది.

"పోయినాయన తీసుకుంటే తప్పులేదు కానీ, మేం తీసుకుంటే తప్పా" అన్నాడు ఆ అపరబ్రహ్మ.

"పోయినాయన తీసుకోవడం అంటే డబ్బు తీసుకుని పోలేదండి బాబూ! జబ్బు చేసి కొన్నాళ్లు బాధ పడి, బాధపడిపోయాడు" అన్నాడు అమృతరావు బావమరిది.

"ఓ అలాగా అయినా నాకు తెలియక అడుగుతాను. బోల్డు డబ్బు ఖర్చుపెట్టి వైద్యం చేయిస్తారు. మందులు కొంటారు. మందులషాపు వాడు మందుల ధర తగ్గిస్తాడా! డాక్టర్లు ఫీజు తగ్గిస్తారా! ఆఖరికి శవదహనానికి, కర్మకాండకి బేరం ఆడతారేమిటి" అన్నాడు అపరబ్రహ్మ.

"అది కాదండి! మీరు కూడా ఆలోచించండి! అంత ఖర్చు తట్టుకోవడం కష్టం కదా!" అన్నాడు అమృతరావు బావమరిది.

"సరేనండీ! మీరు చెప్పేది బాగానే ఉంది కానీ, మా బ్రతుకు తెరువు ఇదే కదా! మళ్లీ ఎవరో పోయేవరకూ మాకు కూడా సంసారాలు నడవాలి కదా! అయినా ఒకటి రెండ్రోజుల తేడాలో ఇద్దరు పోతే ఏమైనా తగ్గించగలం కానీ, లేకపోతే మాకు కూడా కష్టమే!" అన్నాడు అపరబ్రహ్మ.

"మీరు ఎలాగైనా పన్నెండు వేలతో కార్యక్రమం నడిపించండి" అన్నాడు అమృతరావు బావమరిది.

"ఆఖరి మాటగా పదహారు వేలు ఇవ్వండి! మడత గోదానంతో కర్మకాండ చేయిస్తా" అన్నాడు అపరబ్రహ్మ.



"మడత గోదానమంటే ఏమిటి?"

"ఏముంది ఒకే గోవుని అన్నిచోట్లకి తిప్పి, ఆ సమయానికి గోదానం ఏర్పాటు చేస్తాం!" అన్నాడు అపరబ్రహ్మ.

"ఈ మడత వ్యవహారాలు మా బావగార్కి నచ్చవు. అసలే ఆయన అమృతరావు అమృతుడు" అన్నాడు బావమరిది.

"ఆ! ఆయనకి నచ్చినట్లు చెయ్యాలంటే మీరు ఖర్చు తట్టుకోలేరు! నేను ముందే చెపుతున్నాను" అన్నాడు అపరబ్రహ్మ.

"మీరెలాగైనా పన్నెండు వేలల్లో చేయించండి" అన్నాడు బావమరిది.

"పన్నెండు వేలయితే చావుకి పెళ్లి మంత్రాలు, పెళ్లికి చావుమంత్రాలు చదివే ఆయన ఒకడు ఉన్నాడు. ఆయన్ని పంపిస్తాను" అన్నాడు అపరబ్రహ్మ.

"అదేమిటండి అలా అంటారు!" అన్నాడు బావమరిది. "మరేమనమంటారు. మా అమ్మాయికి పెళ్లి కూడా చెయ్యాలి నేను! ఇలా ఎన్ని చావులైతే నా కూతురు పెళ్లి చెయ్యగలను చెప్పండి!" అన్నాడు అపరబ్రహ్మ.

"సరే పోనీ పధ్నాలుగు వేలకి చేయించండి!" అన్నాడు బావమరిది.

"అయ్యా క్షమించాలి! మీ తరపున ఈసారె వరైనా పోతే పధ్నాలుగువేలకి చేయిస్తాను. ఇప్పుడు మాత్రం పదహారు వేలు ఇచ్చెయ్యండి" అన్నాడు అపరబ్రహ్మ.

"మరెవరైనా పోకపోతే!" అన్నాడు బావమరిది.

"మీ వాళ్లెవళ్లూ పోకపోతే తప్పు నాదాండీ. అయినా మీరు ఇంతగా అడుగుతున్నారు కనుక, ఆర్నెలల్లో ఎవరూ పోకపోతే ఒక వెయ్యి రూపాయలు వాపసు ఇచ్చేస్తా! మరి నన్నిక బాధపెట్టకండి!" అన్నాడు అపరబ్రహ్మ.

సరేనని ఒప్పేసుకున్నాడు అమృతరావు బావమరిది.

ఆర్నెలల్లో ఎవరూ పోలేదు! కర్మకాండలో రాయితీ ఉందంటే మాత్రం తొందరపడి పోయే వాళ్లెవళ్లు! చెప్పిన ప్రకారం అపరబ్రహ్మగారు మాత్రం ఆ వెయ్యి రూపాయలు వెనక్కి ఇచ్చేశారు! అప్పట్నుంచీ అందరూ ఆ అపరబ్రహ్మనే కుదుర్చుకునే వారు కర్మకాండలకి.

**-భమిడిపాటి సోమయాజి (హైదరాబాద్)**




